

టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభం



ఎచ్చెర్ల : స్థానిక ట్రిపుల్ ఐటి కళాశాలలో సిఎస్ఇ విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించే సంవిధాన్ టెక్నికల్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఫెస్ట్‌ను ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ప్రారంభించారు. ఇందులో 12 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్లలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.సుధాకర్‌బాబు, ఎఒ మునిరామకృష్ణ, డీన్ కె.మోహనకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, సిఎస్ఇ హెచ్ఒడి రమేష్, అసోసియేట్ డీన్ రమణ, పిఆర్ఒ మామిడి షణ్ముఖ సిఎస్ఇ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోజనం లేని మత్స్య యోజన

- సబ్సిడీ తక్కువ... యూనిట్ ధర ఎక్కువ
- పిఎంఎంఎస్‌వైపై మత్స్యకారుల విముఖత
- 2020లో మంజూరైన యూనిట్లు నేటికీ గ్రౌండింగ్ కాని వైనం

మత్స్యకారుల సంక్షేమం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) పథకంపై మత్స్యకారులు విముఖత చూపుతున్నారు. నామమాత్రపు సబ్సిడీ, స్వల్ప సంఖ్యలో యూనిట్లు కేటాయింపుతో పథకానికి పెద్దగా స్పందన కనిపించడం లేదు. 2020-21లో పథకం ప్రారంభం సంవత్సరంలో కేటాయించిన యూనిట్లు నేటికీ గ్రౌండింగ్ కావడం లేదు. కొన్నిరకాల యూనిట్లకు దరఖాస్తులూ చేయడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ విలువలు యజమానులకు తప్ప సాధారణ మత్స్యకారులకు పెద్దగా ఉపయోగం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మోటారు బోట్లు, తెప్పలపై చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు సుమారు 14 వేల నుంచి 15 వేల మధ్య ఉన్నారు. మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం 2020-21 సంవత్సరంలో పిఎంఎంఎస్‌వై పథకాన్ని ప్రారంభించింది. పథకం కింద మత్స్యకారులకు సాగర మత్స్యకారులకు బోట్లు, వలలు, ఐస్ పెట్టెలు, చేపల విక్రయ కేంద్రాలు తదితర రకాల యూనిట్లు కేటాయిస్తూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పథకంలో జనరల్ కేటగిరీ పరిధిలోని వచ్చే మత్స్యకారులకు 40 శాతం, మహిళలు, ఎస్‌సి, ఎస్‌టిలకు చెరో 60 శాతం సబ్సిడీని అందించాలని నిర్ణయించాయి. 40 శాతం సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వ వాటా 24 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 16 శాతంగా ఉంది. 60 శాతం సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వం 36 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 24 శాతం అందిస్తున్నాయి.

సబ్సిడీ తక్కువ... యూనిట్ ధర ఎక్కువ

యూనిట్ విలువను భారీగా పెంచడం, సబ్సిడీని భారీగా తగ్గించడంతో మత్స్యకారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఉదాహరణకు గతంలో బోటు, వల యూనిట్ ఖరీదు రూ.రెండు లక్షలు ఉండగా, ప్రస్తుతం దాన్ని రూ.ఐదు లక్షలకు పెంచారు. 2016-17, 2017-18 కాలంలో 80 శాతం మేర సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. అంటే గతంలో రూ.రెండు లక్షల యూనిట్‌కు రూ.40 వేలు చెల్లిస్తే బోటు, వల సొంతమయ్యేది. ప్రస్తుతం రూ.ఐదు లక్షల యూనిట్‌కు 40 శాతం సబ్సిడీ పోనూ రూ.మూడు లక్షలు చెల్లించాల్సి రావడంతో, వారికి భారంగా మారింది. కొన్ని యూనిట్ల ఖరీదు రూ.18 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్నాయి. వీటికి అంతేసి మొత్తంలో డబ్బులు చెల్లించి తీసుకోవడం తమవల్ల కాదని మత్స్యకారులు చెప్తున్నారు. జిల్లాలో సుమారు వేలాది మంది మత్స్యకారులు ఉండగా, అరకొరగా యూనిట్లు మాత్రమే కేటాయించారు. ఇవి ఎందుకూ చాలవని మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొన్నిరకాల యూనిట్లకు డిమాండ్ కరువు

పిఎంఎంఎస్‌వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం 19 రకాల యూనిట్లు మంజూరు చేస్తున్నా, కొన్నింటికీ మత్స్యకారులు కనీసం దరఖాస్తు చేయడానికీ ముందుకు రావడం లేదు. అందులో ఓపెన్ సి ఎస్టాబ్లిష్‌మెంట్ యూనిట్ ఒకటి ఉంది. 2020-21లో వంద యూనిట్లు, ఆ తర్వాత సంవత్సరంలో 59 యూనిట్లు మంజూరు చేసినా ఒక్కరూ ఆసక్తి చూపలేదు. రిజర్వాయర్‌లో చేపల వేటకు 2020-21లో పది యూనిట్లు, ఆ తర్వాత సంవత్సరంలో నాలుగు యూనిట్లు మంజూరు చేసినా తీసుకునేందుకు మత్స్యకారులు ఎవరూ ఆసక్తి చూపలేదు. డీప్ సి ఫిషింగ్ వెస్సల్స్ యూనిట్లకు సంబంధించి 2021-22లో ఒక యూనిట్ మంజూరు చేసినా అది ఇప్పటికీ గ్రౌండింగ్ కాలేదు.

మూడేళ్లుగా మంజూరు చేసిన కొన్నిరకాల ముఖ్యమైన యూనిట్లు, గ్రౌండింగ్ కాని వివరాలు

అంశం	2020-21 మంజూరైనవి	గ్రౌండింగ్	2021-22 మంజూరైనవి	గ్రౌండింగ్	2022-23 మంజూరైనవి	గ్రౌండింగ్
ఫిష్ వెండింగ్	5	0	5	0	-	-
టర్ఫ్ ఫిష్ కియోస్కస్	9	1	17	0	-	-
మూడు చక్రాల ఐస్ బాక్సులు	7	0	6	0	-	-
ఫిష్ రిటైల్ మార్కెట్ హబ్స్	1	0	3	0	-	-
సాగరమిత్రలు	60	45	-	-	-	-
ఇన్సులేటెడ్ వెహికల్స్	2	6	-	0	-	-
రిజర్వాయర్లలో చేపలు పట్టే యూనిట్లు	10	0	4	0	-	-
చేపల పిల్లలు (సీడ్స్)	17.63	10.97	-	-	20	0
ఐస్ బాక్సుతో మోటారు సైకిళ్లు	30	30	16	16	-	-
ఫిష్ అవుట్‌లెట్ యూనిట్లు	0	0	91	50	110	0


ర్యాలీగా వెళ్తున్న సిపిఎం నాయకులు

పెను ప్రమాదంలో స్వాతంత్ర్యం

- దేశ సంపదను దోచిపెడుతున్న బిజెపి
- జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - కొత్తూరు

ఎందరో త్యాగధనులు బ్రిటిష్ పాలనను ఎదురించి, వారిని తరిమికొట్టి దేశానికి తెచ్చిన స్వాతంత్ర్యం నేడు పెను ప్రమాదంలో పడిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. సిపిఎం, సిపిఐ ప్రచారభేరి ముగింపు ర్యాలీని మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి డి.గోవిందరావుతో కలిసి ప్రసంగించారు. బిజెపి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చును రాజేస్తోందన్నారు. మరోవైపు దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, బ్యాంకులు, విశాఖ ఉక్కు, ఓడరేవులు, గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, అడవులు, భూములు, ఆఖరికి అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వ అండదండలతో అదానీ ఏవిధంగా ప్రపంచాన్ని మోసం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని గుర్తుచేశారు. దానిపై విచారణకు అంగీకరించకుండా అదానీని బిజెపి ప్రభుత్వం వెనకేసుకొస్తోందని విమర్శించారు. ప్రశ్నించే వారిని నిరంకుశంగా అణచివేస్తోందని చెప్పారు.

సామాన్యులపై భారాలు

పేదలు, సామాన్య ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి వారిపై మోయలేనంత భారాలు మోపుతోందని విమర్శించారు. గ్యాస్, కరెంటు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగిన తీరును వివరించారు. నిరుద్యోగుల బతుకులు అగాధంలోకి జారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామీణ ప్రజలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ బిజెపిని సాగనంపుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో గిరిజనులకు ఐటిడిఎను నిర్మించాలని, వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, ఎం.అప్పారావు, సింహాచలం, నీలారావు, దుర్గారావు, రామయ్య, తెల్లన్న, సుశీల, చామంతి తదితరులు పాల్గొన్నారు.

మే నెలాఖరుకు సచివాలయ భవనాలు పూర్తి

అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో నిర్మితమవుతున్న గ్రామ సచివాలయ భవనాలన్నీ మే నెలాఖరులోగా పూర్తి కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంజినీర్లతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 379 గ్రామ సచివాలయ భవనాలు పూర్తయ్యాయని తెలిపారు. మరో 110 భవనాలు తుది దశలో ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తే 80 శాతం లక్ష్యాలను అధిగమించినట్లు అవుతుందన్నారు. మిగిలిన 20 శాతం పనులు మే నెలాఖరులోగా పూర్తి చేసేందుకు వీలవుతుందని తెలిపారు. మిగిలిన ప్రాధాన్యతా భవన నిర్మాణాలైన రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లపైనా దృష్టిసారించి జూన్ నెలాఖరుకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు మొత్తం చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ఇకపై చేపట్టబోయే పనులకూ నిధుల కొరత లేదన్నారు. సంబంధిత ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి త్వరితగతిన ప్రగతిని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ హెచ్.జయరాంకృష్ణ, కార్యనిర్వాహక, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏం అభివృద్ధి చేశారు?

- చెప్పిన ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు
- ఇలాగైతే రాజీనామా చేస్తాం
- హెచ్చరించిన అధికార పార్టీ కౌన్సిలర్లు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


అభివృద్ధి పనులు చేయకపోతే రాజీనామా చేస్తానంటున్న కౌన్సిలర్ సుజాత

ప్రజాశక్తి - పలాస

మున్సిపల్ పగ్గాలు చేపట్టి రెండేళ్లవుతున్నా, వార్డులో అభివృద్ధి జాడ కనిపించడం లేదని అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్మన్, అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండేళ్లుగా చెప్పిన ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, అలాంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వైసిపి రెండో వార్డు కౌన్సిలర్ బడగల సుజాత మాట్లాడుతూ సూదికొండ, నెమలి నారాయణపురం, కోసంగిపురం ప్రాంతాల్లో ఏమైనా అభివృద్ధి పనులు చేపట్టారా అని నిలదీశారు. వచ్చే సమావేశం లోపు పనులు చేయకపోతే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. 31 వార్డు కౌన్సిలర్ జోగ సతీష్, 19వ వార్డు కౌన్సిలర్ ఎస్.బృందావతి మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లుగా ఉన్నా వార్డులో పిడికెడు సిమెంట్ వేసి ఒక్క పని అయినా చేపట్టారా అని ప్రశ్నించారు. తాగునీరు, రోడ్లు, కాలువల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించలేకపోవడంతో వార్డుల్లో తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యపై నిలదీత

మున్సిపాల్టీలో తాగునీటి ఎద్దడిపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు నిలదీశారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్తున్నా పట్టించుకోవడం లేదని, ఐదు రోజులకోసారి నీరు సరఫరా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. పవర్ బోరులు మంజూరై ఏడాదిన్నర కావస్తున్నా ఎందుకు వేయడం లేదన్నారు. దీనిపై ఛైర్మన్ గిరిబాబు స్పందిస్తూ ప్రతి వార్డుకూ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ అంతటికీ ఒకే మంచి ట్యాంకు ఉన్నప్పుడు ఛైర్మన్ వార్డులో ప్రయివేటు వ్యక్తుల ఇళ్ల నిర్మాణాలకు నీటిని ఎలా సరఫరా చేస్తారంటూ వైస్ ఛైర్మన్ బి.కృష్ణారావు ప్రశ్నించారు. తాను ఆరోపణలు చేయడం లేదని చెప్తూ తన వద్ద సాక్ష్యం ఉందని సెల్‌ఫోన్‌లో చూపించారు. తన వార్డుకు తన సొంత డబ్బులతో తాగునీటినీ సరఫరా చేయించుకుంటున్నాని చెప్పారు.

కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, వాహన డ్రైవర్లకు ప్రతి నెలా జీతాలు చెల్లించడం లేదని, పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. మున్సిపాల్టీ అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనుమతుల్లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే పనులు నిలిపివేసి వారిపై కేసులు నమోదు చేసి నోటీసు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ సీతారాంను ఛైర్మన్ ఆదేశించారు. వీటితోపాటు మున్సిపాల్టీలో పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. తొలుత మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఎఇ అవినాష్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నవోదయ' ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం


సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ రాజేశ్వరి

2023-24 విద్యా సంవత్సరానికి గానూ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 29న నిర్వహించే ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. పరీక్ష నిర్వహణపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఉదయం 11.30 గంటల నుంచి 1.30 వరకు పరీక్ష నిర్వహించే పరీక్షకు జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ప్రధానోపాధ్యాయులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపిని తరిమికొట్టండి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. మండలం లోని యలమంచిలిలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకొస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్, కేసుల భయంతో కిమ్మనడం లేదని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్ గానీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు గానీ, చివరకు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై గానీ చేష్టలుడిగి చూస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం ముందు తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రం అప్పుల ఊబిగా మారిపోయిందన్నారు. వైసిపి పాలనలో విపరీతంగా పెరిగిన ధరల వల్ల సామాన్య, మధ్యతరగతికి చెందిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలూ విసిగిపోయారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపిని ఓడించేందుకు, టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, నాయకులు వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ, రోణంకి లీలామెహన్, గొండు లక్ష్మణరావు, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి ఇవే చివరి ఎన్నికలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస


మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ సీతారాం

తెలుగుదేశం పార్టీకి రానున్న సార్వత్రిక ఎన్నికలే చిట్ట చివరివి అని, ఆ ఎన్నికలతో ఆ పార్టీ కూడా భూస్థాపితం కానుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం లోని కట్యాచార్యులపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జగనన్న కాలనీలో నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా తీసుకుని సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను చేరువ చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. టిడిపి హయాంలో ప్రజలు సంక్షేమ పథకాల కోసం కాళ్లరిగేలా తిరిగే వారని అది మన కర్మ అని, దాన్నే నేడు ఆ పార్టీ ఇదేం కర్మ అంటూ ప్రచారం చేస్తోందని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతుంటే మీకు ఇదేం కర్మ అని ప్రజలు టిడిపి నాయకులను ప్రశ్నించి నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇదేం కర్మ, బాదుడే బాదుడు కార్యక్రమాలను టిడిపి ఎందుకు నిర్వహిస్తుందో అర్థం కావడం లేదని, వచ్చే ఎన్నికల్లో మాత్రం ప్రజలే టిడిపిని బాదుతారని చెప్పారు. నీడను ఇచ్చే చెట్టుని, నిలబడడానికి ఊతమిచ్చే భూమిని, అన్నం పెట్టే అమ్మను, సంక్షేమ పథకాలతో అందరి భవిష్యత్ కోసం ఆలోచించే జగన్మోహన్ రెడ్డిని మరిచిపోతే చరిత్ర హర్షించదన్నారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, మండల సచివాలయ కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడ్కో ఇళ్లు పంపిణీ



శ్రీకాకుళం : నగరంలోని పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లను శనివారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. టిడ్కో గృహాల సముదాయంలో నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమంలో మొత్తం 1208 మందికి పంపిణీ చేయనున్నారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇళ్లను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు.

సెస్ బకాయిలు చెల్లించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరి

శ్రీకాకుళం : జిల్లాలోని ప్రభుత్వ శాఖలు కార్మిక శాఖకు చెల్లించాల్సిన సెస్ బకాయిలను తక్షణమే చెల్లించేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి అన్నారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యాక్ట్, వెల్ఫేర్ సెస్ యాక్టు, వెల్ఫేర్ సెస్ రూల్స్‌పై జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం ఆర్‌డిఒ బి.శాంతి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పై చట్టాల్లోని నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వేతర భవన నిర్మాణాలు, కట్టడాల్లో ప్రభుత్వానికి ఒక శాతం సెస్ చెల్లించాల్సి ఉన్నా, కొన్ని శాఖలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. సెస్ చెల్లించని వారు అపరాధ రుసుము కూడా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో రూ.1,12,47,496 సెస్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.49,10,654 చెల్లించినట్లు వివరించారు. మిగిలిన బకాయిలను వెంటనే చెల్లించేలా అధికారులు దృష్టిసారించాలన్నారు.

కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.డి.వి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర భవన నిర్మాణాలు, ఇతర కట్టడాలన్నీ నమోదు కావాల్సి ఉందన్నారు. జిల్లాలో చాలా నిర్మాణాలున్నా నాలుగు వేల భవనాలు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. ప్రతి కట్టడంలో ఉపయోగించే కార్మికుల్లో వారి సంక్షేమం కోసం ఒక శాతం సెస్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులూ నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.70 లక్షల మంది మాత్రమే నమోదయ్యారని, వీరితోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉపాధి హామీ కూలీలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీరంతా ఐదేళ్లకు రూ.110 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇందుకు డ్వామా ఎపిడిలు, ఎంపిడిఒలు, సంబంధిత అధికారులు ఇందుకు సహకరించాలని కోరారు. బకాయిలను ఇదివరకే చెల్లించిన అధికారులు చలానా ప్రతులను తమకు అందజేయాలని, చెల్లించని వారు తక్షణమే చెల్లించి అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఎపిఐఐసి మేనేజర్ బి.రామకృష్ణ, సుడా ప్లానింగ్ అధికారి టి.జి రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు పి.వి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

రీ సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కవిటి

రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ తమరాల సీతారామ్మూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన శుక్రవారం సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఆక్రమణలు గుర్తించాలని, సర్వే పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కవిటి సచివాలయం-1 పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెల్నెస్ అసిస్టెంట్ ఎప్పటికప్పుడు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ కేంద్రాలు సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సచివాలయ వ్యవస్థ ద్వారా అందించే అన్ని సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ సంతోష్‌కుమార్, డిటి రామచంద్రరావు, ఎంఇఒ ధనుంజయరెడ్డి, హెచ్‌ఒ మాధవీలత, వెటర్నరీ డాక్టర్ శిరీష, ఆర్‌ఐ రమణమూర్తి, ఇఒ వీరభద్రస్వామి, ఎఒ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక పరీక్షలు

టెక్కలి: విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహించిన వార్షిక పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 20న ప్రారంభమైన వార్షిక పరీక్షలు నేటితో ముగిశాయి. మరో రెండు రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. సిబిఎ పద్ధతిలో 6వతరగతి నుంచి 8వతరగతి వరకు పరీక్షలు నిర్వహించగా 9వ తరగతి విద్యార్థులకు మాత్రం పదో తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒఎంఆర్ షీటు ద్వారా జవాబు పత్రాలు నింపించగా, ప్రైవేటు స్కూళ్లలో మామూలు పద్ధతిలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వివరాలు చేరవేశారు. కరోనా తర్వాత పక్కాగా జరిగిన విద్యా సంవత్సరంలో భాగంగా ఈ ఏడాది వార్షిక పరీక్షలు సజావుగా పూర్తి అయ్యాయి.

టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ బహుకరణ

ప్రజాశక్తి - పలాస



మెటీరియల్‌ను పరిశీలిస్తున్న గోపి, శ్రీనివాసరావు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రాథమిక పాఠశాలకు గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన ఎన్‌ఆర్‌ఐ గోరంట్ల వాసుబాబు రూ.25 వేలు విలువ చేసే టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ బహుకరించారు. వాటిని శుక్రవారం వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కిష్ట గోపి, ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు అందజేసిన మెటీరియల్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌ఐ మెటీరియల్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. దీనికి కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం మధుసూదనరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు సనపల నరసింగరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఈశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ లఖ్య, పూర్వ ప్రధాన ఉపాధ్యాయులు రెడ్డి మాస్టర్, సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీ కోటేశ్వరరావు, అంజనేయులు మాస్టర్, బగాది సింహాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం : సిఐటియు



పరిశ్రమ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - రణస్థలం

యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని, లేకపోతే ప్రజల మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. రెండవ రోజు శుక్రవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో యుబీ పరిశ్రమ ముట్టడి, వంటావార్పు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రేవరీస్ యాజమాన్యం ఆక్రమంగా కార్మికులందరిని నిలుపుదల చేసి కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. పరిశ్రమ స్థాపనకు భూమిలిచ్చిన స్థానిక కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా కార్మికులకు పని కల్పించకపోవడంతో వారి కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయని, పిల్లల స్కూల్ ఫీజులు, కిరాణా ఖర్చులు ఎలా కట్టాలో తెలియక మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. యాజమాన్యం తన మొండి వైఖరి వీడి కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుబి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఐ.నారాయణరావు, జె.గంగరాజు, నాయుకులు పి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, భద్రయ్య, చిన్న, కె.రమణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుకు ఆర్థిక సహాయం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నుండి యుబి పరిశ్రమ గేటు ముందు కార్మికులు ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వంటావార్పు కార్యక్రమానికి కోష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథనాయుడు రూ.15వేలు, కోష్ట ఎంపిటిసి పిసిని అసిరినాయుడు రూ.రెండు వేలు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు రూ.ఐదు వేలు, కోష్ట టిడిపి సీనియర్ నాయకులు పైడి అప్పడుదొర రూ.మూడు వేలు, సాయిసుధ హోటల్ యజమాని లక్ష్మణరావు రూ. రెండు వేలు ఆర్థిక సహాయం అందజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

గడప గడపకు సంక్షేమ పరవళ్లు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సంక్షేమ పరవళ్లు గడప గడపకు కొనసాగుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని 8వ వార్డు గేటులో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని అన్నారు. గత ప్రభుత్వం వలె మాటల ప్రభుత్వం కాదని, ఈ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని అన్నారు. కుల, మతం, ప్రాంతం పార్టీలను చూడకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సచివాలయ కన్వీనర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యాంప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, సచివాలయ సిబ్బంది, మాజీ కౌన్సిలర్ మామిడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రవి, సాధు చిరంజీవి, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల బాదుడే బాదుడు

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలపై పన్నుల బాదుడే బాదుడు కొనసాగిస్తోందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం 15, 16వ వార్డు పరిధిలో ఉన్న పాతినవారి వీధి, వరదా వారి క్వార్టర్స్, కండ్రపేట వీధుల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వైసిపి పాలన గతంలో ఉన్న టిడిపి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్నుల రూపేనా ప్రజలపై బాదుడే బాదుడును కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో నగదును ఇచ్చినట్టే ఇచ్చి పన్నుల రూపేనా అధిక మొత్తంలో నగదును వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను వేసుకుంటూ పోతున్నారని, ప్రజలంతా ఇది గమనించాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత సిఎందేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మాజీ కౌన్సిలర్స్ కణితి విజయలక్ష్మి, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, వి.ప్రసాద్, జి.నాగేశ్వరరావు, కూన అప్పలనాయుడు, కింజరాపు శివ, తంగి గురయ్య, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న గౌతు శిరీష

రాక్షస పాలన పోవాలంటే టిడిపి రావాలి

పలాస: రాష్ట్రంలో వైసిపి పాలన భయంకరంగా ఉందని, రాక్షస పాలన పోవాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం బిన్నల మధనాపురం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిందేమీ లేదని విమర్శించారు. రానున్న 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. పట్టభద్రులు ఎమ్మెల్సీలను గెలిపించి అధికార పార్టీకి చెమటలు పట్టించారని, త్వరలో సామాన్య ప్రజలు సైతం వారి ఆవేదన వ్యక్తం చేసేందుకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లింగరాజు, రుద్రయ్య, విక్రమ్, దామోదర, క్రరియ్య, దాసరి తాతారావు, పి.విరాస్వామి, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్టానికిలో పాల్గొన్న కూన రవికుమార్

కోటబొమ్మాళి: వైసిపి ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని టిడిపి మండల నాయకులు అన్నారు. మండలంలోని యలమంచిలి, లఖందిడ్డి గ్రామంలో శుక్రవారం మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, మండల అధ్యక్షులు బి.రమేష్ ఆధ్వర్యాన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, నంబర శ్రీనివాస్, కె.అప్పారావు, జి.లక్ష్మణరావు, దేవాది సింహాద్రి, పి.సింహాచలం, శిమ్మ నారాయణరావు, హచ్.అప్పలరాజు, కోట సంతోష్‌కుమార్, ఆనందరావు, బి.అన్నపూర్ణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పైపులైను మరమ్మతులు

ప్రజాశక్తి - నరసన్నపేట



పైపులైను పనులను పరిశీలిస్తున్న శంకరరావు

నరసన్నపేట జర్నలిస్టుల కాలనీలో వారం రోజులుగా నిలిచిపోయిన మురుగునీటి కాలువ, నూతన వాటర్ ట్యాంక్ పైపులైను పనులను మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరెల్ల శంకరరావు శుక్రవారం పర్యవేక్షించారు. తొందరగా పనులు పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఆయనతో పాటు డైరెక్టర్ సదాశివుని కృష్ణ, వాలంటీరు బి.రజని, తదితరులు పాల్గొన్నారు.

దివాకర్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - నరసన్నపేట



దివాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బిసి కమిషన్ సభ్యులు పక్కి దివాకర్ మృతి శిష్టకరణ సంఘానికి తీరనిలోటు అని ఆ సంఘం మండల అధ్యక్షులు సదాశివుని కృష్ణ అన్నారు. శుక్రవారం నరసన్నపేట శిష్టకరణ సంఘ భవనంలో దివాకర్ సంతాపసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివాకర్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. కొద్దిసేపు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. దివాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రభాకరరావు, ఎంవిజె.మోహనరావు, అంపలాం వసంతకుమార్, డివి.రఘు, కె.వైకుంఠరావు, యు.కృష్ణమోహన్, సదాశివుని సింహాచలం, జగన్నాథరావు, ఎన్.కృష్ణ, బి.రాము, ఆర్‌వి.గోవిందరాజులు, కె.బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఎంపిడిఒగా విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వి.విశ్వేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన లావేరు మండలం ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్నారు. ఇక్కడ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపిడిఒగా పని చేసిన సీపాన హరిహరరావు ప్రస్తుతం సెలవులో ఉన్నారు.

సమీకృత వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి - కవిటి

చిన్న, సన్నకారు రైతులకు సమీకృత వ్యవసాయ విధానంతో మేలు చేకూరుతుందని డిపిఎం(ఎల్‌హెచ్) నారాయణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎఫ్‌పిఒ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, కొబ్బరి రైతులకు ఐఎఫ్‌సి (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్)పై శుక్రవారం శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ 300 మంది మహిళా రైతులతో ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబానికీ 5 నుంచి 10 వ్యవసాయ, అనుబంధ కార్యక్రమాలు రుపొందించి వారి ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సభ్యులు కచ్చితంగా ఎఫ్‌పిఒలో సభ్యులుగా ఉండాలని అన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 365 రోజులు ఆదాయం వచ్చేలా చేసే ఈ విధానం రైతులకు ఎంతోమేలు చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిపిఎం(హెచ్.డి) శ్రీనివాస్, ఎఫ్‌పిఒ ఎపిఎం ఈశ్వరరావు, కవిటి ఎపిఎం గోవిందరావు, ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరావు

ఇంటర్ ఫలితాల్లో

కెజిబివి విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి - పొందూరు



వి.అశ్వని

ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కెజిబివి విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలను సాధించి, తమ సత్తాను చాటారు. ప్రథమ ఇంటర్ బైపిసిలో 64శాతం, ద్వితీయ ఇంటర్ బైపిసిలో 85.6శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్ బైపిసి ఫలితాల్లో వి.అశ్వని 956 మార్కులు, యలకల భారతి 945 మార్కులు సాధించి తమ సత్తాను చాటారు. మొత్తం 9మంది విద్యార్థినులు 900 మార్కులు పైబడి సాధించారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించడంపై ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థినులను అభినందనలు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో టెక్కలి, నరసన్నపేట వ్యవసాయ డివిజన్లలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ డీలర్లు ఎంఆర్‌పికి మించకుండా ఉత్పత్తులు విక్రయించాలన్నారు. లేకుంటే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చాలా గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు నాశిరకం ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అమ్ముతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, తాము ఎప్పుడు ఏ షాపులపై దాడులు చేస్తామో చెప్పబోమని, దాడులు చేసినప్పుడు నాశిరకం విక్రయించినట్లు తెలిస్తే లైసెన్సు రదుతో పాటు, చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఎడిఎ జివి.తిరుమలరావు, నరసన్నపేట ఎడిఎ కె.రవీంద్రభారతి, ఎఒ ఎస్.గోవిందరావు, తొమ్మిది మండలాల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

కొబ్బరిలో తెల్లదోమ నివారణపై శిక్షణ

ప్రజాశక్తి - రణస్థలం

కొబ్బరి తోటలను విపరీతంగా నష్టపరిచే రూగోస్ తెల్లదోమను తొలి దశలోనే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక వల్లభరావుపేట గ్రామంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రైతులకు కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ నివారణ, సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరిలో తెల్ల దోమ వేసవిలో ప్రారంభమై, శీతాకాలం నాటికి సంతతిని వృద్ధి చేస్తుందన్నారు. దీని వల్ల కొబ్బరి, అనేక పంటల్లో దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు కొబ్బరిలో ఏడాదికి రెండు సార్లు ఎరువుల యాజమాన్యం పాటించడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు అన్నారు. తెల్లదోమ జీవిత కాలం కేవలం 30-40 రోజులు అయినప్పటికీ అది అనతికాలంలోనే సుమారు 100 గుడ్ల వరకూ పెట్టి తన సంతతిని వృద్ధి చేసుకుంటుందని, దీని నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కెవికె శాస్త్రవేత్త వి.హరికుమార్ రైతులకు సూచించారు. కొబ్బరి ఆకుల దిగువ భాగంలో తెల్లని సర్పిలాకార తెల్ల దోమ గుడ్లను గుర్తించిన దరిమిలా 10000 పిపిఎం సామర్థ్యం గల వేప నూనె లీటరు నీటికి 1 మి॥లీ చొప్పున కలుపుకుని ఆకు దిగువ భాగం మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. గంజి పొడిని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. సస్య రక్షణలో భాగంగా కొబ్బరిని విపరీతంగా ఆశించే కొమ్ము పురుగు, ఎర్ర ముక్కు పురుగుల నియంత్రణకు రైతులందరూ సామూహికంగా హెక్టారుకు 2 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సమగ్రంగా నియంత్రించ వచ్చని మండల ఉద్యానశాఖ అధికారి ఎం.అనూషా రైతులకు సూచించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ రాజ్ మోహన్, గ్రామ సర్పంచ్ ప్రతినిధి చిరంజీవి, మహంతి సత్యనారాయణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు పి. తవిటినాయుడు, ఎస్.పి.నారాయణరావు, పి.రమణ, రైతు మిత్రలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రసాద్

మందలించారని వెళ్లిపోయాడు

ప్రజాశక్తి - కవిటి



భానుప్రకాష్ (ఫైల్)

ఇంటర్ పరీక్ష తప్పడంతో తల్లిదండ్రులు మందలించారని కవిటి మండలం కవిటి కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కవిటి పోలీసులు అందించిన సమాచారం మేరకు కవిటి కొత్తూరు గ్రామానికి చెందిన మర్ల మాధవరావు కుమారుడు మర్ల భానుప్రకాష్ శ్రీకాకుళంలోని శ్రీ సాయికష్ణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో భానుప్రకాష్ తప్పాడు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో కవిటిలో బంధువుల ఇంటికి ప్రసాదం ఇచ్చేందుకు వెళ్లిన భానుప్రకాష్ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా భానుప్రకాష్ ఆచూకీ తెలియలేదు. గురువారం సాయంత్రం 5గంటల సమయంలో కవిటి కల్యాణి పెట్రోల్ బంకు వద్ద భానుప్రకాష్ సైకిల్ లభ్యమైంది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కవిటి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పొందూరు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రైలు పట్టాలపై వృద్ధుని మృతదేహం

పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు (65) శుక్రవారం మృతి చెందినట్లు పలాస జిఆర్‌పి ఎస్ఐ ఎస్‌కె.షరీఫ్ తెలిపారు. వృద్ధుడు రైలు నుంచి కాలుజారి పడి ఉండొచ్చని, లేదా రైలు పట్టాలు దాటే సమయంలో ప్రమాదం జరిగి ఉండొచ్చని జిఆర్‌పి పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, కాషాయం రంగు లుంగీ, తెల్లని గెడ్డం, కుడి పక్కటెముకుల పక్కన, ఎడమ కన్ను దిగువన పుట్టుమచ్చలున్నాయని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్‌ఫోన్ నెంబరు 9491106219ను సంప్రదించాలని తెలిపారు.

లింగాలవలసలో..

పలాస: టెక్కలి-తెంబూరు రైల్వేస్టేషన్ మధ్య లింగాలవలస గ్రామం వద్ద గురువారం రాత్రి రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జిఆర్‌పి ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి జీన్‌ప్యాంట్, బలియాను వేసుకొని ఉన్నారని, సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు వయస్సు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నిరుద్యోగులను మోసగించారు

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్

ప్రజాశక్తి - నరసన్నపేట

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వాటి భర్తీపై నిర్లక్ష్యం వహించడం వారిని మోసగించడమేనని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా జాబ్ క్యాలండర్ ఇచ్చి, ఏయే నెలల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తామో నోటిఫికేషన్ ఇస్తామని చెప్పిన నాలుగు ఏళ్ల నుంచి డిఎస్‌సి నోటిఫికేషన్ రాక బిఇడి అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఖాళీగా ఉన్న 50వల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్యాలయాల్లో ఉన్న ఖాళీలు తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. 20వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసి పోలీసులపై ఉన్న పనిభారంతో పాటు, రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తెచ్చేందుకు ఉద్యోగాల భర్తీ చేస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో ప్రతి వస్తువూ కల్తీ అయిన నేపథ్యంలోవాటిని పరిరక్షించే ఫుడ్ సేఫ్టీ అధికారులు 19 మందే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం అన్ని విద్యార్థి సంఘాలు ఐక్య కార్యాచరణతో ఉద్యమ బాట పట్టేందుకు నిరుద్యోగులు సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం మేల్కొని నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి ఎ.రాము, ఎన్.సాంబశివరాజు, జలుమూరు మండల కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుగంధర్

రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని వినతి



ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పూండి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును టిడిపి నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. పూండి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం కుర్చీలు ఏర్పాటు చేయాలని, అండర్ పాస్ వద్ద ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పూండి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ రైల్వే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారని టిడిపి నాయకులు పుచ్చ ఈశ్వర్‌రావు, కర్ని రమణ తెలిపారు.



బోరు మరమ్మతులు చేస్తున్న నవీన్

సొంత నిధులతో బోరు మరమ్మతులు

పలాస: వేసవి దృష్ట్యా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు పురుషోత్తపురంలో ప్రజలు నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. దీని నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. దీన్ని గమనించిన వార్డు ప్రతినిధి సప్ప నవీన్ శుక్రవారం తన సొంత నిధులతో వీధుల్లో ఉన్న బోరులను మరమ్మతులు చేసి, వార్డు ప్రజలకు తాగునీటిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో బద్రి గోపాల్, బద్రి వెంకటరావు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీలే కీలకం

ఆమదాలవలస: పాఠశాలల అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీలే కీలకమని ఎంఇఒ దుప్పల రామారావు అన్నారు. శుక్రవారం బొబ్బిలిపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మెట్ట సన్యాసిబట్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పాఠశాల తరగతి గదులు, పిల్లలు ఆడుకోవడానికి చిల్డ్రన్ పార్క్, ఆట స్థల నిర్మాణం, ప్రహరి నిర్మాణం, నిత్యం నీటి వసతితో మరుగుదొడ్ల సౌకర్యం తదితర మౌలిక వసతులను మెరుగుపరించుకోవడంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీలే బాధ్యత వహించాలని సూచించారు. ఎపిఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల చదువు కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని అందుపుచ్చుకోవాలన్నారు. సర్పంచ్ గొండు వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. చదువులో, పాఠశాల హాజరులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు గోవిందరావు మాస్టారు ప్రశంసా పత్రాలతో, జ్ఞాపికలు అందించారు.

నేడు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ రాక

టెక్కలి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కమిషనర్ పోలా భాస్కర్ శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రానున్నారు. కళాశాల ఆవరణలో ప్రజా భాగస్వామ్యంతో నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కమిషనర్ సమక్షంలో కళాశాల అభివృద్ధి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు తల్లిదండ్రుల సమావేశం

టెక్కలి: ప్రభుత్వ పాఠశాల్లో విద్యా సంసవత్సరం ముగింపు సందర్భంగా శనివారం ప్రతి ఒక్క ప్రభుత్వ పాఠశాల్లో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఎంఇఒ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పూర్తి అయిన వార్షిక పరీక్షల్లో ఆయా విద్యార్థి పొందిన మార్కులు, హాజరుతో కూడిన ప్రగతిపత్రాలు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించి, వారి ప్రగతిని వివరించాలని ఆదేశించారు. వేసవి సెలవుల్లో చేపట్టబోయే కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళిక తయారుచేసుకోవాలని సూచిస్తు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశము నిర్వహించనున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆమలపాడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన కర్ని తులసిరావు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయంను సర్పంచ్ దున్న రత్నం బాలరాజు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అప్పలరాజు ఆదేశాల మేరకు తులసీరావుకు వైఎస్ఆర్ బీమా రూ.లక్ష మంజూరైందని చెప్పారు. ప్రతి ఒక్కరూ బీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు లింగరాజు, వార్డు మెంబర్ పాపారావు, సచివాలయ కన్వీనర్లు బి.రాజు, వసంత, కె.రమణ, ప్రేమ, తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందిస్తున్న రత్నం బాలరాజు

సామాజిక తనిఖీపై శిక్షణ

ప్రజాశక్తి - కవిటి

పాఠశాలల సామాజిక తనిఖీపై ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణలో ఎంఇఒ ధనుంజయ మజ్జి పాఠశాలలో నిర్వహిస్తున్న అనేక రకాల కార్యక్రమాల అమలు, నిర్వహణ తీరు పరిశీలన, ఆ పాఠశాల పరిధిలోని సముదాయ సభ్యులు, తల్లిదండ్రుకు, విద్యార్థులు, సిబ్బందిని కలిసి సమాచారాన్ని సేకరించి పాఠశాలల సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అమలుపరుస్తున్న వివిధ పథకాల గురించి సవివరంగా చర్చించడంతోపాటు వివిధ అధికారులు, అనధికారులు, సమాజ భాగస్వాముల విధులు, బాధ్యతలు గురించి రిసోర్స్ పర్సన్ చలపతిరావు వివరించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి



మాట్లాడుతున్న ఎంఇఒ అప్పారావు

హెచ్ఎంలకు ఒక్క రోజు శిక్షణ

ఇచ్ఛాపురం: పాఠశాలలో నిర్వహిస్తున్న అనేక రకాల కార్యక్రమాల అమలు, నిర్వహణ తీరును పరిశీలించడానికి, పాఠశాల హెచ్ఎంలు, తల్లిదండ్రుల కమిటీతో తనిఖీ చేయించడంపై ఒక రోజు శిక్షణ నిర్వహించినట్లు ఎంఇఒ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహణ, బాలల హక్కులు, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009, ప్రజల భాగస్వామ్యం, స్థానిక సంస్థల తోడ్పాటు, సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అమలుపరుస్తున్న వివిధ పథకాల గురించి చర్చించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.

ఎస్‌టి చైర్మన్ దృష్టికి గిరిజన సమస్యలు

మెళియాపుట్టి: ఎస్‌టి చైర్మన్ కె.రవిబాబు దృష్టికి మండలంలోని గిరిజన సమస్యలు తీసుకెళ్లినట్లు గిరిజన సంఘం నాయకులు సరవ కుమార్ తెలిపారు. గిరిజన గ్రామాలకు సరైన రహదారులు లేవని, అత్యవసర సమయంలో వైద్య సేవలు అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నట్లు చెప్పాడు. వినతిపత్రం అందించిన వారిలో పలువురు గిరిజనులు ఉన్నారు.



రవిబాబుకు వినతిపత్రం అందిస్తున్న కుమార్

పోస్టల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కాశీబుగ్గ: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘం గుర్తింపును రద్దు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ శుక్రవారం పోస్టల్ ఉద్యోగులు కాశీబుగ్గ ఉప తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ పోస్టు మాష్టారు ఎం.వేమన, జి.డి.ఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.నందికేశ్వరరావు, సంఘం నాయకులు దివాకర్, గురుమూర్తి, సతీష్, రాజశేఖర్, ప్రకాశరావు, రాము, జగన్నాథరావు, తేజేసు, దొరబాబు, భాస్కరరావు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

60 మందికి వైద్య పరీక్షలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మోదుగువలసలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ కణితి కేశవరావు పర్యవేక్షణలో 60 మందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో గ్రామీణ ప్రాంత ప్రజలు అనుసరిస్తున్న పద్ధతులు ఆదర్శప్రాయమైనవని అన్నారు. జాతీయ సేవా విభాగం పిఒ వి.లూక్‌పాల్, కంది గొల్ల, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న కణితి కేశవరావు

తాగునీటికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కవిటి

వేసవి తీవ్రత దష్ట్యా తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైస్ ఎంపిపి కర్రి గోవయ్య, బెజ్జిపుట్టుగ సర్పంచ్ నారాయణస్వామి తెలిపారు. బెజ్జిపుట్టుగ పంచాయతీ పెద్దకర్రివానిపాలెంలో శుక్రవారం రెండు తాగునీటి బోర్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రి యువరాజు, స్కూల్ చైర్మన్ సాగూరు బాబురావు, ఐక్యవేదిక సభ్యులు కర్రి పండయ్య మాస్టారు, పంచాయతీ కన్వీనర్ కర్రి దీనబంధు, వార్డ్ మెంబర్ జానకమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ షణ్ముఖరావు, మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ కర్రి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.